'కరెన్సీ' వినాయకుడు

కరెన్సీ అలంకరణలో వినాయకుడు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 13 : జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కరెన్సీ వినాయకుడు ఆకట్టుకుంటున్నాడు. శుక్రవారం రూ.22 లక్షల 22 వేల 2 వందల కరెన్సీ నోట్లతో స్వామి వారిని అలంకరించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. కరెన్సీ వినాయకుడిని చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ప్రభుత్వ దవాఖాన నిర్మాణానికి ఆంధ్రా కలప

వైద్య కళాశాల ముందు నిలిపి ఉన్న కలప వాహనం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 13 : జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్డులో ప్రభుత్వ దవాఖాన నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని పులివెందుల నుంచి కలప రావడం చర్చనీయాంశమైంది. శుక్రవారం ఉదయం ప్రత్యేక వాహనంలో పెద్ద ఎత్తున దర్వాజలు, కిటికీలు తీసుకొచ్చారను. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొని ఎక్కడి నుంచి కలప వచ్చింది.. ఎలా వచ్చింది.. సరైన పత్రాలు ఉన్నాయా.. లేదా అనే కోణంలో ఆరా తీశారు. వాహణాన్ని డివిజన్ కార్యాలయానికి తరలించి పూర్తి డాక్యుమెంట్లు పరిశీలించినట్లు తెలిసింది. ఈ విషయమై మంచిర్యాల ఎఫ్‌ఆర్వో రత్నాకర్‌రావును వివరణ కోరగా.. ఆంధ్ర నుంచి వచ్చిన కలప వాహనానికి సరైన పత్రాలు ఉన్నాయని, కాంట్రాక్టర్లు వివిధ ప్రాంతాల్లో నిర్మాణాలు చేస్తుండడంతో అక్కడ మిగిలిన కలపను మరోచోటకు తరలిస్తారని చెప్పారు. కాగా, స్థానికంగా ఉన్న వారి వద్ద కలప వాడుకుంటే కొంతమందికైనా ఉపాధి దొరికేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

జీపీల్లో ఓటరు జాబితా ప్రదర్శన

ఆసిఫాబాద్ టౌన్/తాండూర్/జైనూర్/ దహెగాం/చెన్నూర్ రూరల్/ జైపూర్/ కౌటాల , సెప్టెంబర్ 13 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాలను శుక్రవారం అధికారులు ప్రదర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని సందేహాలు, అభ్యంతరాలు ఉంటే 21వ తేదీ వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు తెలియజేయాలని సూచిస్తున్నారు. 18న జిల్లాస్థాయిలో కలెక్టర్లతో, 19న మండలస్థాయి అధికారులతో ఓటరు జాబితాపై సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 26వ తేదీ వరకు పరిశీలించి, 28వ తేదీన తుది ఓటరు జాబితాలను అన్ని గ్రామపంచాయతీల్లో ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఆసిఫాబాద్‌లో జాబితాపై డీపీవో భిక్షపతి ప్రకటన విడుదల చేశారు. జైనూర్ మండలంలో ఓటరు జాబితా ప్రచురించినట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, మండల ఇన్‌చార్జి పంచాయతీ అధికారి మోహన్, ఎంపీవో మోహన్ తెలిపారు. దహెగాం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేందర్.., చెన్నూర్ మండలం కొమ్మెర జీపీలో కార్యదర్శి మౌనిక, ఈజీఎస్ సీఏ కాళేశ్వరం తిరుపతి.., జైపూర్ మండలం ఇందారం జీపీలో డీఎల్పీవో ధర్మారాణి, ఎం పీవో బాపు, కార్యదర్శి సుమన్.., కౌటాలలో ఎంపీడీవో కోట ప్రసాద్, కార్యదర్శి సుబ్బ సాయికృష్ణ, ముత్తంపేట ప్రత్యేకాధికారి గావు డే హన్మంతు జాబితాలను ప్రచురించారు.

రైల్వేస్టేషన్‌లో ఎమర్జెన్సీ విజిల్.. ఉలిక్కిపడ్డ ప్రజలు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 13 : బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ఎమర్జెన్సీ విజిల్ మోగింది. దీంతో ఏదైనా ప్రమాదం జరిగిందా..? ఏ రైలైనా పట్టాలు తప్పిందా..? అని ప్రజలు, ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. చుట్టుపక్కల ప్రజలు వెంటనే స్టేషన్‌కు వెళ్లి, చూసి ఖంగుతినానరు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఈ ఎమర్జెన్సీ విజిల్‌ను మోగిస్తారని, ఈ విజిల్‌తో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తమవుతారు. అందుకు అనుగుణంగా మోక్‌డ్రిల్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

కోటపల్లి, సెప్టెంబర్ 13 : కోటపల్లి మండలకేంద్రంలోని ఐదు దుకాణాలను నెలవారీ అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు సీహెచ్ దుర్గా ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్‌కు సంబంధించి మండల కేంద్రంలో ఐదు దుకాణాలు ఖాళీగా ఉన్నాయని, షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులు 25 లోగా కలెక్టరేట్‌లోని ఎఫ్-3 బ్లాక్ మొదటి అంతస్తులో గల తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

కోటపల్లి, సెప్టెంబర్ 13 : రైతులందరికీ షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. కోటపల్లి మండలం రొయ్యలపల్లిలో సీపీఎం మహాసభ సమావేశంలో ముందుగా సీతారాం ఏచూరికి మరణానికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్మ పున్నం, బొడెంకి చందు, కావిరి రాజబాపు, రవి, సిడాం సమ్మక్క, ఆత్రం శ్రావణ్, సంపత్, సమ్మయ్య, శ్రీకాంత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ రైడింగ్ చైర్స్ ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 13 : శ్రీరాంపూర్ ఎస్సార్పీ-3 గనిలో మ్యాన్‌రైడింగ్ చైర్స్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య డిమాండ్ చేశారు. బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదాతోకలిసి శుక్రవారం గనిని సందర్శించారు. కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, పిట్ కార్యదర్శి మురళీ చౌదరి, నాయకుల అంబాల రవి, అఫ్రోజ్‌ఖాన్, రోమాజి, విక్కి, సురేశ్, సారయ్య, కిరణ్ పాల్గొన్నారు.

వంద పని దినాలు పూర్తిచేయాలి

జైపూర్, సెప్టెంబర్ 13 : ఉపాధిహామీలో జాబ్‌కార్డులున్న ప్రతి ఒక్కరూ 100 పని దినాలు పూర్తిచేసేలా పనులు చేయాలని ఎంపీవో శ్రీబాతి బాపు పేర్కొన్నారు. మండలంలోని ఇందారం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి కూలీలతో గ్రామసభ నిర్వహించారు. వంద పనిదినాలు పూర్తి చేయడం ద్వారా మెటీరియల్ కాంకౌండు కింద రోడ్డు, డ్రేయిన్లు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరెకులస్తులను ఓబీసీ జాబితాలో కలపాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 13 : ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం జాతీయ వెనుకబడిన తరగతుల సంఘం చైర్మన్ హన్సరాజ్ గంగారాంకు వినతిపత్రం అందించారు. ఆయనకు ముందుగా మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలు విన్నవించారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ

బెల్లంపల్లి, సెప్టెంబర్ 13 : బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మహాలక్ష్మి పథకం ధ్రువీకరణ పతారలను శుక్రవారం అధికారులు అందజేశారు. మొత్తం 14 దుకాణాలకు మంజూరైన వారి ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై ఆగ్రహం

- హైదరాబాద్ వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- ప్రభుత్వ తీరుపై మండిపాటు

కోటపల్లి/సీసీసీ నస్పూర్/బెల్లంపల్లి/భీమారం/జన్నారం, సెప్టెంబర్ 13 : రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపుమేరకు హైదరాబాద్ బయల్దేరుతున్న నాయకులను పోలీసులు ఉదయాన్నే ఇంటింటికీ వెళ్లి అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇలాంటి అక్రమ అరెస్టులు హేయమైన చర్య అని, తెలంగాణలో రాక్షస పాలన కొనసాగుతున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన అరికెపూడి గాంధీ, అతని గూండాలను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అరెస్టులతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఆపలేరని, తెలంగాణ ఉద్యమంలో సైతం అక్రమ అరెస్టులు చేస్తే ఇవ్వేత్తున ఎగిసిపడ్డారని గుర్తుచేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యేపై దాడులకు దిగిన గాంధీతో పాటు, కాంగ్రెస్ గూండాలను అరెస్ట్ చేయాలన్నారు. కోటపల్లిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మండల యూత్ అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్, నాయకులు ఆసంపల్లి సంపత్, ఆసరెల్లి నూతన్, అసంపల్లి అనిల్, కొండ సంతోష్‌ను గురువారం రాత్రి పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సీసీసీ నస్పూర్‌లో బీఆర్ఎస్వీ మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గల మధుకుమార్, బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు కాటం రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు కందుల ప్రశాంత్, సంయుక్త కార్యదర్శి మహ్మద్ సాజిద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టారు. బెల్లంపల్లి వన్ టౌన్ పోలీసులు కొత్తబస్టాండ్ ఏరియాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సబ్బని అరుణ్‌కుమార్ అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాళ్లగురిజాల పోలీసులు బెల్లంపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ గుర్రాల రాయమల్లు, యూత్ నాయకులు కాంపెల్లి విశాల్, గంధం తిరుపతి యాదవ్, శేఖర్ మందుస్తు అరెస్ట్ చేశారు. భీమారం పోలీసులు పార్టీ మండలాధ్యక్షుడు కలగూర రాజ్ కుమార్, సీనియర్ నాయకులు దాసరి మధునయ్య, ఆత్కూరి రాము, పానుగంటి లచ్చన్న, నాయకులు జలంపల్లి తిరుపతి, భూక్యా రాజ్ కుమార్ నాయక్‌ను అరెస్టు చేశారు. జన్నారంలో మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కమ్మల విజయధర్మ, జిల్లా అధికార ప్రతినిది సిటిమల భరత్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, నాయకులు ఫజల్‌ఖాన్, బోర్లకుంట ప్రభుదాస్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్, గురువయయ్య, శ్రీదర్‌రావు, రవి విలేకరులతో మాట్లాడారు.

కోటపల్లి : పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు

పూజలు, అన్నదానాలు

మంచిర్యాల అర్బన్ : పూజల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల అర్బన్/మంచిర్యాలటౌన్/హాజీపూర్/చెన్నూర్ రూరల్/రెబ్బెన, సెప్టెంబర్ 13 : జిల్లాలో గణేశ్ మండలపాల వద్ద పూజలు, కుంకుమ పూజలు, అన్నదానాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయకులను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. సెవెన్‌హిల్స్ కాలనీలో ఏర్పాటుచేసిన శ్రీ వేంకటేశ్వర గణేశ్ మండలి వద్ద మాజీ కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. శ్రీనివాస్ దంపతులను కాలనీ మహిళలు సన్మానించారు. హాజీపూర్ మండలం గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద కమాండెంట్ వెంకట్రాములు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. అస్టిటెంట్ కమాండెంటుల నాగేశ్వర్ రావ్, కాళిదాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ ఐలు, బెటాలియన్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. చెన్నూర్ మండలం ఆస్నాద్‌లోని ఆభయాంజనేయ స్వామి ఆలయంలో గణపతి మండపం వద్ద మాజీ ఉప సర్పంచ్ సన్కూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. దాతలు బెల్లంకొండ సత్యనారాయణ, అరిగెల వైకుంఠం సహకారంతో అన్నదానం నిర్వహించారు. రెబ్బెన మండలం ఖైర్‌గూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీలో గణనాథుల వద్ద బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, ఇంజినీర్ భీంరావుజాడే, పీఈ వీరన్న, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

మంచిర్యాల టౌన్ : బోరిగం శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న కాలనీ మహిళలు

చెన్నూర్ రూరల్ : పూజలు చేస్తున్న భక్తులు

హాజీపూర్ : పూజల్లో బెటాలియన్ కమాండెంట్ దంపతులు

రెబ్బెన : ఖైర్‌గూడ ఓసీపీలో ఏరియా జీఎం శ్రీనివాస్

మీ ఇంట్లో ఇలాగే తింటారా?

కాసిపేట, సెప్టెంబర్ 13 : కాసిపేట కేజీబీవీ, మోడల్ హాస్టల్‌ను బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి జే ముకేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల సమస్యలు ఒక్కొక్కటీ బయటకురావడంతో విస్మయం వ్యక్తం చేశారు. వంట నిర్వహణ సామగ్రి బూజు పట్టి ఉండడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజనం దారుణంగా ఉంటుందని, తినలేకపోతున్నామని, పురుగులు వస్తున్నాయని, గుడ్డు సగం మాత్రమే వేస్తున్నారని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, నాన్ వెజ్ సమయంలో పులుసు తప్ప.. ఒక్క ముక్క కూడా ఉండదని వారు జడ్జికి వివరించారు. మీ ఇంట్లో ఇలాగే తింటారా అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. ఇంత వరకు మా సమస్యలు గురించి పట్టించుకున్న వారే లేరని, మీరు వచ్చి మా సమస్యలు తెలుసుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థినులు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాఠశాల పరిసరాలు పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉండడంతో వెంటనే శుభ్రం చేయాలని జడ్జి సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిప్ప మనోహర్, జనరల్ సెక్రటరీ సింగతి రాజేశ్, జాయింట్ సెక్రటరీ దాసారపు రాజు, సీనియర్ న్యాయవాదులు ఎల్ రాము, శివ కుమార్, రవికుమార్, మహిళా న్యాయవాది సంగీత, బాల కృష్ణ, సంతోశ్, గోలి శ్రీనివాస్, మాదరి రాకేశ్ తదితరులున్నారు.



కాసిపేట : బూజుపట్టిన కంచిపప్పును పరిశీలిస్తున్న బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముకేశ్

ఐలమ్మకు అరుదైన గౌరవం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 13 : తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మకు అరుదైన గౌరవం దక్కిందని రజక సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాజన్న అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ప్రభుత్వం కోరిలోని మహిళా కళాశాలకు ఐలమ్మ పేరు, ఆమె మనుమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించిందని పేర్కొన్నారు. పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్, పోశం, రమేశ్, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రమణను ఆదర్శంగా తీసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 13 : టీఎన్జీవీ రమణను ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్ పేర్కొన్నారు. ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం రమణ రెండో వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు దుర్గం దినకర్, గేడం టీకనంద్, కొరెంగ మాల శ్రీ, ఆత్మకూరు సతీశ్, వడ్లూరి శ్రీకాంత్, చిట్టి భారతి, అక్షయ, సంతోష్, అసిఫ్ తదితరులున్నారు.

కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 13 : కాగజ్‌నగర్ మండలం వన్జీరి గ్రామంలో సీపీఎం, సీఐటీయూ, టీఏజీఎస్, ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో టీఎన్జీవీ రమణ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కుశన రాజన్న ముంజం ఆనంద్, ముంజం శ్రీనివాస్, కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు వీడాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 13 : మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మూఢనమ్మకాలను వీడి, సైన్స్ వైపు అడుగులు వేయాలని జన విజ్ఞాన దర్శిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ గురుకుల, వాంకిడి మండలంలోని జడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు దుర్గం దినకర్, గొడిసెల కార్తిక్, టీకానంద్, కోరెంగ మాల శ్రీ, ఆత్మకూరి సతీశ్, శ్రీకాంత్, నగేశ్, అవిడపు ప్రణయ్ కుమార్, జన విజ్ఞాన దర్శిని రాష్ట్ర నాయకులు రాజు, మొహమ్మద్ అలీ, మహేశ్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

వేమనపల్లి, సెప్టెంబర్ 13 : ఈ నెల 17న నిర్వహించనున్న 'అమ్మ కోసం మొక్క' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో దేవేందర్ కోరారు. వేమనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వన మహోత్సవం కార్యక్రమంలో నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ప్రతిరోజూ పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

గట్రాంపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాసిపేట, సెప్టెంబర్ 13 : కాసిపేట మండలం గట్రాంపల్లి గ్రామంలో శుక్రవారం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ప్రెసిడెంట్ సత్య భ్రత శర్మ, యూనిట్ హెడ్ బాల గిరిధర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గట్రాంపల్లి గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పరీక్షలు చేసి, మందులను అందించారు. దూర ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించారు. ఓరియంట్ సీనియర్ జీఎం ఆనంద్ కులకర్ణి, డాక్టర్ ఝాన్సీ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల పరిశీలన

జైనూర్ సెప్టెంబర్ 13 : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశాల మేరకు మండలంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని మార్లవాయి, పవర్ గూడ గ్రామాల్లో నిర్వహించిన శిబిరాలను ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఇన్‌చార్జి మండల పంచాయతీ అధికారి మోహన్ పరిశీలించారు. ఈ శిబిరాల్లో వైద్య ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట, సెప్టెంబర్ 13 : కొండాపూర్ యాప వద్ద రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతూ మాజీ ప్రజాప్రతినిదులు కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందించారు. ఆయన సానుకూలంగా స్పందించి.. ఓరియంట్ సిమెంట్ ప్రెసిడెంట్ (మాన్యుఫాక్చరింగ్)తో మాట్లాడి మరమ్మతు చేయించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించి బెల్లంపల్లి నుంచి కాసిపేటకు తరలించాలని కోరగా, సంబంధిత శాఖతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రం రావు, మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉత్తూరి సత్తయ్య, నస్పూరి నర్సింగ్, లక్ష్మణ్ ఉన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 13 : మంచిర్యాల పట్టణానికి చెందిన పలువురు రౌడీ షీటర్లను శుక్రవారం పట్టణ సీఐ బన్సీలాల్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. వినాయక నిమజ్జనంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

భీమారం, సెప్టెంబర్ 13 : భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీల్లో నీటి గోస రోజురోజుకూ పెరుగుతున్నది. బోర్లు పాడైపోయి తాగునీరులేకపోవడంతో శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. పది రోజులుగా రెండు బోర్లు పాడైపోయినా పట్టించుకునే అధికారి కరువైయ్యాడని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

కారు, లారీ ఢీ.. ఇద్దరికి గాయాలు

జైపూర్, సెప్టెంబర్ 13 : జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం పౌనూర్ క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గోదావరిఖని వైపు నుంచి చెన్నూర్ క్రాస్ వైపు వెళ్తున్న లారీని అదే మార్గంలో వెళ్తున్న కారు అతివేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఆనంద్‌తో పాటు, మరొకరికి గాయాలయ్యాయి. వీరిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

పాఠశాలల తనిఖీ

కౌటాల, సెప్టెంబర్ 13 : కౌటాల మండలం ముత్తంపేట కాంప్లెక్స్ పరిధిలోని బారెవాడ, కుంబారి ప్రాథమిక పాఠశాలలను మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు తనఖీ చేశారు. ఎన్ఏఎస్, ఎఫ్ఎల్ఎన్ అమలు తీరు, బోధనా పద్ధతులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, పౌష్టికాహారం అందించాలని సూచించారు. సీఆర్పీ గంధం ప్రకాశ్ ఉన్నారు.

హిందీ దివస్

హాజీపూర్, సెప్టెంబర్ 13 : మండలంలోని దొనబండ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నీలేశ్ కచ్‌వాల్, ఆర్ సికందర్ ఆధ్వర్వంలో హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నృత్యాలు, పాటలు, ఉపన్యాస పోటీలు, సన్నివేశాల ప్రదర్శన పోటీలను నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దహెగాం, సెప్టెంబర్13 : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ తెలిపారు. కోత్మీర్, చిన్నరాస్పల్లి విద్యుత్ ఉపకేంద్రాల్లో మరమ్మతుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాలతో పాటు మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం సాలిగాం, భీమిని మండలంలోని కేస్తాపేర్, కొత్తగూడ(కే), చిన్నతిమ్మపూర్, పెద్ద తిమ్మపూర్ గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించగలరని పేర్కొన్నారు.

కోటపల్లి, సెప్టెంబర్ 13 : చెన్నూర్ నుంచి కోటపల్లికి వచ్చే 133 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా కోటపల్లి మండలం ఆలుగామ, దేవులవాడ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంద